సాక్షి ఆదిలాబాద్

గురువారం : 25 జూలై 2024



విద్యుత్‌తో తస్మాత్ జాగ్రత్త

వానాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశముంది. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

8లో▸



'బదిలీ' అధికారులకు సన్మానం

కైలాస్‌నగర్: బదిలీపై వెళ్తున్న రెవెన్యూ అధికారులను బుధవారం కలెక్టర్ రాజర్షిషా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సన్మానించారు. కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్, సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన బల్దియా అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాల్టీకి బదిలీపై వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం విధుల్లో చేరారు. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారిగా ఏ సుమలత, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా కే నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్టు చేశారు. కాగా, ఇంజినీరింగ్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న ఎండీ యూనుస్ వనపర్తి మున్సిపాల్టీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న మద్దెల కార్తీక్ నియమితులయ్యారు. స్థానికంగా పోస్టు కలిగి డిప్యూటేషన్‌పై రామగుండంలో పనిచేస్తున్న మరో డీఈ మసూద్ మంచిర్యాల మున్సిపాల్టీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

బల్దియాలో కంట్రోల్‌రూం

కైలాస్‌నగర్: జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాల్ యంత్రాంగం అప్రమత్తమైంది. పట్టణ ప్రజలు ఇబ్బందులను తెలిపేందుకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసింది. రోజంతా ఒకరు, రాత్రి పూట మరొకరు సేవలందించేలా ఇద్దరికి కంట్రోల్ రూం బాధ్యతలు అప్పగించారు. ప్రజలు సహాయం కోసం 6281619678, 7989959286 నంబర్లను సంప్రదించాలని కమిషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. ప్రజలకు సాయమందించేందుకు 10 మంది శానిటరీ జవాన్లతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో ప్రజలెవరూ ఉండకూడదని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లు ఇస్తున్న ఎస్పీ

జైనథ్: మండల కేంద్రానికి చెందిన 14మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా వాటిని రికవరీ చేసి బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం బాధితులకు అందజేశారు. రికవరీలో కీలక పాత్ర పోషించిన సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, ఐటీ కోర్ టీం, ఇతర పోలీసులను ఎస్పీ అభినందించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తే కఠినచర్యలు'

నార్నూర్: రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని డీఏవో పుల్లయ్య హెచ్చరించారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగుమందులు విక్రయించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతువేదికలో రైతులకు పంటలపై అవగాహన కల్పించాలని ఏవోకు సూచించారు. ఏవో జాడి దివ్య, ఏఈవో నాగోరావు తదితరులున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



నితిన్‌గడ్కరితో మాట్లాడుతున్న నగేశ్

కైలాస్‌నగర్: కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ రహదారి–44 భోరజ్ నుంచి మహారాష్ట్రలోని ఉపాస్‌నాలా వరకు గల 33 కిలో మీటర్ల రోడ్డును రెండు వరుసలుగా మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. దీనిని నాలుగు వరుసల రహదారిగా మార్చాలని విన్నవించారు. ఇందుకు కేంద్రమంత్రి స్పందిస్తూ ఫోర్‌లేన్ రోడ్డుగా మార్చేందుకు వీలుగా కొత్తగా మరో డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఎంపీ తెలిపారు.

భట్టి.. వరాలిస్తారని..



మల్లు భట్టివిక్రమార్క, ఉపముఖ్యమంత్రి

- గంపెడాశలతో జిల్లావాసులు
- ప్రాజెక్టులకు నిధులు ఇచ్చేనా?
- డిప్యూటీ సీఎం జిల్లావాసులకు ఇచ్చిన హామీలు నెరవేరేనా?
- నేడు రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్

20శాతం ప్రత్యేక నిధులివ్వాలి

ఉట్నూర్‌లో నిర్వహించిన రైతు భరోసా వర్క్‌షాప్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైతు భరోసాపై ప్రస్తావిస్తూనే జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, నూతన ప్రాజెక్టులు, జిల్లాలోని రహదారుల పరిస్థితి, బ్రిడ్జిల నిర్మాణం లాంటి అనేక అంశాలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు మంత్రివర్గ ఉప సంఘం ముందు ఓ ప్రస్తావన తెచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా 20 శాతం నిధులు కేటాయించి ఈ



ప్రాంత సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుండటంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

సాక్షి, ఆదిలాబాద్: 'జిల్లాపై సంపూర్ణ అవగాహన ఉంది.. గతేడాది మార్చి 16వ తేదీన ఇక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభించి నెలపాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించాను.. ఆనాడు పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్‌గా నేను, ఏఐసీసీ నాయకులు పలు హామీలిచ్చాం.. వాటిని తప్పకుండా నెరవేరుస్తాం.. తుమ్మిడిహెట్టి, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులు మొదలుపెడతాం.. చనాక–కొరట ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం.. నీళ్లు ఇస్తాం..' ఇది జూలై 11వ తేదీన రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం వచ్చిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశ అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విలేకరుల సమావేశంలో అన్న మాటలు.

ఇప్పుడు భట్టి విక్రమార్క మాటలు మరోసారి ఎందుకు ప్రస్తావించాల్సి వస్తోందంటే.. గురువారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క ఆర్థికశాఖ మంత్రిగా కూడా ఉన్నారు. ఆయనే అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో సీఎల్పీ నేతగా ఈ ప్రాంతంలో పాదయాత్ర చేసినప్పుడు ఇచ్చిన హామీలు తనకు గుర్తున్నాయని, వాటిని నెరవేర్చే దిశగా కృషి చేస్తానని ఇటీవల ఉట్నూర్‌కు వచ్చినప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే భట్టి ప్రవేశపెట్టే రాష్ట్రస్థాయి బడ్జెట్‌లో జిల్లాపై ప్రత్యేకత చూపుతారని ఉమ్మడి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆశిస్తున్నారు.

జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి..

- నేరడిగొండ మండలం కుప్టి గ్రామం వద్ద ప్రాజెక్ట్ నిర్మించాలని గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలోచన చేసింది. 2018లో రూ.794 కోట్ల వ్యయంతో నిర్మించాలని అంచనా వేసింది. అయితే ప్రాజెక్ట్ నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పలుసార్లు ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అంచనా వ్యయం సవరిస్తూ వచ్చారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.1,323 కోట్లకు చేరింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు స్థిరీకరణకు కుప్టి గ్రామం వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా నిర్మించనున్నారు. తద్వారా రానున్న రోజుల్లో దీని నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో ఈ ప్రాంతంలో ఆయకట్టుకు కూడా సాగునీరు అందించవచ్చనే ఆలోచన ఉంది. అలాగే కుంటాల జలపాతానికి ఏడాది పొడవునా జలకళ ఉండేలా ప్రణాళిక చేశారు. ఇలా బహుళార్ధ ప్రయోజక ప్రాజెక్ట్‌గా దీని రూపకల్పన చేశారు.
- తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో జైనథ్ మండలం కొరట గ్రామం వద్ద సరిహద్దు మహారాష్ట్రలోని చనాక మధ్యలో పెన్‌గంగా నదిపై ఇదివరకే బ్యారేజ్ నిర్మించారు. దీనికి సంబంధించి పంప్‌హౌస్, ఎల్‌పీపీ కెనాల్ పనులు తుదిదశకు చేరాయి. ఇక ప్రధాన కెనాల్ నుంచి కాలువలు, ఉప కాలువల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. దీనికి సంబంధించి భూ సేకరణతో పాటు నిర్మాణానికి సంబంధించి మరో రూ.250 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే ఎల్‌పీపీ కెనాల్ ద్వారా 37,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం దీనికి నిధులు కేటాయిస్తుందా.. లేదా.. అనేది చూడాల్సిందే.
- జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్ నిర్మాణం చేపట్టాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో 363 ఎకరాల రక్షణ శాఖకు సంబంధించి భూములున్నాయి. అదనంగా 1,500 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ భూములకు ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంది. ఈ విషయంలో ఏదైన అనుకూల నిర్ణయం వెలవడుతుందా.. చూడాల్సిందే.
- జిల్లా కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మధ్యలో ఈ పనులు వివిధ కారణాలతో ఆగిపోయాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ఈ ప్రాజెక్ట్‌లో రూ.27 కోట్లు రావాల్సి ఉంది. వాటికి సంబంధించి ఈ బడ్జెట్‌లో ఏదైన ప్రస్తావిస్తారని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

కమ్మేసిన ముసురు



ఇంద్రవెల్లి: వరద నీటితో పొంగిపొర్లుతున్న జైత్రంతండా వాగు

జూన్ 1నుంచి జూలై 24 వరకు వర్షపాతం

సాధారణం	447.2 మి.మీ.లు
కురిసింది	535.0 మి.మీ.లు
వ్యత్యాసం	20 శాతం అధికం
స్థితి	అధికం

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి మొదలైన ముసురు ఇంకా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వాన కురుస్తోంది. జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో మోస్తరుగా నమోదైంది. అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం ప్రజలకు సూచించారు. కలెక్టరేట్, ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జూన్‌లో మొదటి మూడు వారాలు జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. నాలుగో వారం నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. జూలైలోనూ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు అధిక వర్షపాతం నమోదైంది. 18 మండలాలు ఉండగా, ఆదిలాబాద్ అర్బన్‌లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. బేల, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్‌రూరల్, తాంసి, బజార్‌హత్నూర్, ఉట్నూర్ మండలాల్లో అధిక వర్షపాతం, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని జైనథ్ మండలం సాత్నాల, తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరబోతున్నాయి. సాత్నాల ప్రాజెక్ట్‌కు 880 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు నాలుగు గేట్లు ఉండగా, ఇప్పటివరకు తెరవలేదు. మత్తడి వాగుకు 122 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు ఐదు గేట్లు ఉండగా, ఇప్పటివరకు తెరవలేదు. కుంటాల, పొచ్చర, గాయత్రి జలపాతాలు ప్రవాహాలతో హోరెత్తిస్తున్నాయి.

మంగళవారం నమోదైన వర్షపాతం

మండలం	వర్షం (మి.మీ.లలో)
ఆదిలాబాద్‌అర్బన్	64.6
ఆదిలాబాద్‌రూరల్	48.9
బేల	45.7
ఇంద్రవెల్లి	45.6
ఉట్నూర్	41.6
జైనథ్	38.8
గుడిహత్నూర్	35.3
మావల	32.7
బజార్‌హత్నూర్	31.3
తాంసి	31.0
భీంపూర్	30.0
ఇచ్చోడ	29.0
నార్నూర్	22.1
తలమడుగు	21.3
నేరడిగొండ	20.8
బోథ్	20.7
గాదిగూడ	19.5
సిరికొండ	6.1

ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలు

సాత్నాల పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 284.15 మీటర్లు ఉంది. 1.24 టీఎంసీల సామర్థ్యానికి 0.750 టీఎంసీలకు చేరింది. మత్తడివాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 276.00 మీటర్లు ఉంది. 0.571 టీఎంసీలకు 0.391 టీఎంసీల నీరు చేరింది.

టెంపరరీ అవుట్ ఆఫ్ సర్వీస్!

- డీఆర్డీవోలో సెల్‌ఫోన్ల మూగనోము
- పెండింగ్ బిల్లులు చెల్లించని ఫలితం

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన క్లోజ్డ్ యూజర్స్ గ్రూప్ (సీయూజీ) సెల్‌ఫోన్లు మూగబోయాయి. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సదరు మొబైల్ సంస్థ సేవలు నిలిపివేసింది. సదరు అధికారులు, ఉద్యోగుల సెల్‌ఫోన్లను సంప్రదించగా 'టెంపరరీ అవుట్ ఆఫ్ సర్వీస్' అనే సమాధానమే వినిపిస్తోంది. దీంతో సంబంధిత కార్యాలయంలో రోజువారీగా జరగాల్సిన సమాచార వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సదరు అధికారుల నుంచి రావాల్సిన సమాచారం అందని పరిస్థితి తలెత్తుతోంది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థికాభివృద్ధిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కీలకమైంది. ఆ శాఖలో పనిచేసే డీఆర్డీవోతో పాటు ఒక ఏపీడీ, ఏడుగురు డీపీఎంలు, 21మంది ఏపీఎంలు, 106 మంది సీసీలకు శాఖా సంబంధిత వ్యవహారాల నిర్వహణకు ప్రభుత్వం ఓ ప్రైవేట్ మొబైల్ కంపెనీకి చెందిన సీయూజీ సిమ్ కార్డులు కేటాయించింది. వాటికి సంబంధించి ప్రతినెలా సుమారు రూ.3లక్షల బిల్లు వచ్చే అవకాశముంది. కొద్దినెలలుగా ఆ బిల్లులు పేరుకుపోవడంతో సదరు మొబైల్ సంస్థ సేవలు నిలిపివేసింది. ప్రస్తుత సాంకేతికత పెరిగిన నేపథ్యంలో శాఖాపరమైన వ్యవహారాలన్నింటినీ ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్ల ద్వారా నమోదు చేస్తున్నారు.



జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయం

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తికి సంబంధించి వివిధ యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. మంగళవారం డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ లబ్ధిదారుల ఎంపికను త్వరగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం వారంతా అదే పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో డీఆర్డీవో, ఒకరిద్దరు ఏపీఎంలు మినహా మిగతావారి సెల్‌ఫోన్ సేవలు నిలిపివేయగా దాని అమలుపై ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాలను అందించేందుకూ ఇదే కీలక సమయం కావడంతో ఆ ప్రక్రియకు కూడా అవరోధమేర్పడే అవకాశముంది. ఈ విషయమై డీఆర్డీవో సాయన్నను 'సాక్షి' సంప్రదించగా సెల్‌ఫోన్ సేవలు నిలిచిపోయిన మాట వాస్తవమేనని చెప్పారు. బిల్లుల చెల్లింపు ప్రభుత్వ పరిధిలోని అంశమని పేర్కొన్నారు.

తప్పులను సవరించాలి

ఆదిలాబాద్‌టౌన్: లెఫ్టోవర్ వేకెన్సీ ప్రమోషన్ జాబితాలో దొర్లిన తప్పులను సవరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ కోరారు. బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన ప్రమోషన్లలో నాట్ విల్లింగ్, ఆబ్సెంట్ పోస్టు ఇచ్చిన ఉపాధ్యాయులను మళ్లీ జాబితాలో చేర్చవద్దని, ఏరకంగానైనా ఒకసారి ప్రమోషన్ తిరస్కరించినవారిని ప్రమోషన్ జాబితా నుంచి తొలగించి సీనియారిటీలోకి తదుపరి ఉపాధ్యాయులను చేర్చి ప్రమోషన్లు కల్పించాలని సూచించారు. తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సంఘం నాయకుడు భూమన్న తదితరులున్నారు.



డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేస్తున్న టీపీయూఎస్ నాయకులు

అసలే ఖాళీలు.. ఆపై బదిలీలు

- 11మంది బదిలీ.. ఒక్కరికే పోస్టింగ్
- రిమ్స్‌లో పేదల వైద్యంపై ప్రభావం
- వెనుకబడిన జిల్లాపై సర్కారు వివక్ష

ఆదిలాబాద్‌టౌన్: వెనుకబడిన జిల్లాలోని ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2008లో జిల్లా కేంద్రంలో రిమ్స్ మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. వైద్యసేవలు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పదుల సంఖ్యలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాణ్యమైన వైద్యం మాట అటుంచితే ఇప్పటికీ వైద్యుల ఖాళీలతో ప్రాథమిక స్థాయి వైద్యమే అందుతోందనే ఆరోపణలున్నాయి. మెరుగైన వైద్యం అందించేలా పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తుంటే, అందుకు భిన్నంగా ఉన్న వైద్యులను ఇతర జిల్లాలకు బదిలీ చేయడంతో పేదల వైద్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతోపాటు వైద్యవిద్యను అభ్యసించే మెడికోలకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. రిమ్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చూడాల్సిన ప్రభుత్వం ఇక్కడ పనిచేసే 11మంది వైద్యులను బదిలీ చేసి ఒక్క వైద్యుడినే జిల్లాకు కేటాయించడం విడ్డూరంగా ఉంది. అసలే జిల్లాకు వైద్యులు రాక ఉన్నవారితో నెట్టుకొస్తున్న తరుణంలో బదిలీలు పేదల పాలిట శాపంగా మారనున్నాయి. ప్రస్తుతం వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర వాసులకు పెద్ద దిక్కుగా నిలిచే రిమ్స్‌లో వైద్యులను బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

11 మంది వైద్యుల బదిలీ

రిమ్స్ ఆస్పత్రిలో పనిచేసే ముగ్గురు ప్రొఫెసర్లు అనస్తీషియా, ప్యాథాలజీ, ఫార్మకాలజీ, అసోసియేట్ ప్రొఫెసర్లు నలుగురు ఆర్థో, మెడిసిన్ విభాగంలో ఇద్దరు, బయోకెమిస్ట్రిలో ఒకరు బదిలీ అయ్యారు. అయితే జిల్లాకు పీడియాట్రిక్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌ను ప్రభుత్వం జిల్లాకు కేటాయించినట్లు తెలుస్తోంది. అలాగే నలుగురు ట్యూటర్లను బదిలీ చేసినట్లు సమాచారం. ఇప్పటికే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు రిలీవ్ కాగా, ట్యూటర్లు రిలీవ్ కావాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ చూపాల్సి ఉండగా, పట్టించుకోకపోవడంతో ఇక్కడ పనిచేసే వైద్యులు ఇతర జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంది.



రిమ్స్ ఆస్పత్రి

పేదల వైద్యంపై ప్రభావం

పేదలకు రిమ్స్ వరప్రదాయినిగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆర్థిక ఇబ్బందులతో చాలామంది పేదలు ఎలాంటి జబ్బు వచ్చినా రిమ్స్‌కు వస్తారు. వీరితో పాటు జిల్లాకు ఆనుకుని మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. ఇప్పుడిప్పుడే రిమ్స్ గాడిన పడుతుండగా ప్రభుత్వం సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లను బదిలీ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో పేదల వైద్యంపై ప్రభావం చూపుతోందని పేర్కొంటున్నారు. రిమ్స్‌లో 148 వైద్యపోస్టులకు గాను 89 మంది పనిచేస్తున్నారు. 59 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇదే పరిస్థితి ఉంది. సూపర్ స్పెషాలిటీలో 13 విభాగాలకు సంబంధించి 52 పోస్టులు మంజూరు కాగా, ఒక్కరు కూడా రెగ్యులర్ వైద్యుడు లేరు. 16మంది వైద్యులతో కాలం వెల్లదీస్తున్నారు. 36 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కార్డియాలజీ, యూరాలజీ, న్యూరో సర్జన్, పీడియాట్రిక్ సర్జన్, అనస్తీషియాలజీ, సర్జికల్ అంకాలజీ, ఇద్దరు ఆర్‌ఎంవోలు, ఎనిమిది మంది సీఎంవోలు మాత్రమే పనిచేస్తున్నారు.

రిమ్స్‌లో పోస్టుల వివరాలు

హోదా	పోస్టులు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
ప్రొఫెసర్	21	15	06
అసోసియేట్ ప్రొఫెసర్	30	19	11
అసిస్టెంట్ ప్రొఫెసర్	41	19	22
ట్యూటర్లు	56	32	24

సూపర్ స్పెషాలిటీలో పోస్టుల వివరాలు..

డిపార్ట్‌మెంట్	మంజూరు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
కార్డియాలజీ	4	1	3
యూరాలజీ	2	1	1
న్యూరో సర్జన్	2	1	1
పీడియాట్రిక్ సర్జన్	2	1	1
రేడియాలజీ	2	–	2
అనస్తీషియాలజీ	14	1	13
కార్డియో థొరాసిస్ సర్జరీ	2	–	2
నెఫ్రాలజీ	2	–	2
న్యూరాలజీ	2	–	2
మెడికల్ గ్యాస్ట్రాలజీ	2	–	2
సర్జికల్ అంకాలజీ	2	1	1
సీఎస్ ఆర్‌ఎంవో	4	2	2
సీఎంవో	12	8	4
మొత్తం	52	16	36

కలెక్టరేట్ ఏవో, తహసీల్దార్ల రిలీవ్

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాలకు కేటాయించబడ్డ కలెక్టరేట్ పరిపాలనాధికారి ఆర్.అరవింద్‌కుమార్‌తో పాటు మరో ఏడుగురు తహసీల్దార్లను విధుల నుంచి రిలీవ్ చేస్తూ కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, గుడిహత్నూర్, బేల, సిరికొండ, నేరడిగొండ, ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్లు ఉన్నారు. వారి స్థానాల్లో నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సదరు అధికారులు తమ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

రెవెన్యూ ఉద్యోగులకు పోస్టింగ్

ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూశాఖ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పనిచేస్తూ ఈ నెల 18వ తేదీన జరిగిన కౌన్సెలింగ్‌లో బదిలీ అయిన 15 మంది జూనియర్ అసిస్టెంట్లు, 18 మంది ఆఫీస్ సబార్డినేట్లకు జిల్లాలోని వివిధ మండలాల్లో పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాల సంబంధిత అధికారులు కొత్త పోస్టింగ్‌లో సదరు ఉద్యోగులు విధుల్లో చేరేలా వారిని రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీటీలు, ఆర్‌ఐలకు పోస్టింగ్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా రెవెన్యూ శాఖలో పనిచేస్తూ ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన కౌన్సెలింగ్‌లో బదిలీ అయిన నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 16మంది నాయబ్ తహసీల్దార్లు, 25 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఆర్‌ఐలకు జిల్లాలోని వివిధ మండలాల్లో పోస్టింగ్ కల్పించారు. కాగా, ఉట్నూర్ ఎపిక్ డీటీగా బదిలీ అయిన కవితారాణిని కలెక్టరేట్‌కు, ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయిన జాదవ్ గణేశ్‌ను ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికే డిప్యూటేషన్‌పై కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న గ్రామస్తులు

ముథోల్: తప్పిపోయిన పదేళ్ల బాలుడిని తల్లిదండ్రులకు తిరిగి అప్పగించిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చించాల గ్రామంలో గుర్తుతెలియని బాలుడు సంచరిస్తుండగా గమనించిన గ్రామస్తులు దుడ్డు ప్రసాద్, హాజేకర్ దత్తులు బాలుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడు చెప్పిన వివరాల ప్రకారం భైంసాలోని శాస్త్రినగర్‌కు చెందిన వరుణ్‌తేజ్‌గా గుర్తించారు. వెంటనే భైంసా టౌన్ ఏఎస్సై సుదర్శన్‌కు వివరాలు తెలియజేసి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన అధికారులు

బోథ్: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొచ్చర జలపాతంలో దూకడానికి ప్రయత్నించగా అటవీశాఖ అధికారులు కాపాడారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొచ్చర జలపాతం సమీపంలోకి వెళ్లి బట్టలు విప్పిన సదరు వ్యక్తి దూకేందుకు ప్రయత్నించగా గమనించిన అటవీ అధికారులు వెంటనే పట్టుకున్నారు. అనంతరం ఆయన వివరాలు తెలుసుకొని కుటుంబసభ్యులకు అప్పగించారు. వ్యక్తిని కాపాడిన వారిలో అటవీ అధికారి అనిల్, సెక్యూరిటీ గార్డ్ అశోక్ ఉన్నారు.

అటవీ సంపదను కాపాడాలి



ఎఫ్ఆర్వో గణేశ్‌తో ట్రెయినీ ఎఫ్‌బీవోలు

నేరడిగొండ: అటవీ సంపదను కాపాడాలని ఎఫ్ఆర్వో గణేశ్ ట్రెనీ ఎఫ్‌బీవోలకు సూచించారు. దూలపల్లి అకాడెమీ నుంచి 35వ బ్యాచ్‌కు చెందిన 33 మంది ట్రెనీ ఎఫ్‌బీవోలు ఏసీడీ రామ్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం కుంటాల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో వీరికి జలపాతం ప్రాముఖ్యత, అటవీ రక్షణ, సిరిచెల్మ రేంజ్ గురించి వివరించారు. అటవీ సంపదను స్మగ్లర్ల బారి నుంచి ఎలా రక్షించాలో సూచించారు.

తోడేళ్ల దాడిలో ఐదు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

తాంసి(బోథ్): మేకల మందపై తోడేళ్లు దాడి చేసి ఐదు మేకలను హతమార్చిన ఘటన మండలంలోని జామిడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బెల్లపు గంగారం మేకలను రోజువారీగా గ్రామ శివారులోని తన కొట్టంలో ఉంచగా, మంగళవారం రాత్రి పాకలోకి చొరబడిన తోడేళ్లు మేకల మందపై దాడి చేశాయి. ఐదు మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో రెండు మేకలను తోడేళ్లు లాక్కెళ్లాయి. బుధవారం మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ మృతిచెందిన మేకలను పరిశీలించారు. మేకలపై ఉన్న గాయాలను పరిశీలించి తోడేళ్ల దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన మేకలకు చికిత్స చేశారు. మృతి చెందిన వాటి విలువ రూ.70వేల వరకు ఉంటుందని తెలిపారు.

‘విద్యుత్’తో తస్మాత్ జాగ్రత్త!

- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయం
- ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి
- విద్యుత్‌శాఖ డీఈ రాజన్న



బెల్లంపల్లి: వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ డీఈ బి.రాజన్న పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తడి చేతులతో స్విచ్ బటన్ నొక్కడం, తెగిపోయిన కేబుల్ వైర్‌ను చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని ముట్టుకోవడం, ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లపై తడి బట్టలను ఆరేయడం వంటి చర్యలు ప్రాణాలమీదికి తెస్తాయని, అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు. విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలలని సూచిస్తున్నారు. విద్యుత్ సమాచారం ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో లేదా వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్‌పోల్‌ను ముట్టుకోవద్దు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కరెంట్ తీగల కింద నిలబడడం, నడవడం చేయకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టవద్దు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేయాలి.
- విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను ముట్టుకోవద్దు. ఎక్కడైన చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటిపైకి ఎక్కి కరెంట్ తీగల సమీపానికి వెళ్లొద్దు. తీగలపై పడిన దుస్తులను కర్రలతో కానీ లోహంతో తయారు చేసిన రాడ్లతో కానీ తీయకూడదు.
- వర్షం పడుతున్న సమయంలో ఆరుబయట ఉన్న విద్యుత్ వైర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతులు చేయరాదు.

ఇళ్లల్లో..

- ఇంట్లో ఉన్న స్విచ్‌లను, ఇతరాత్ర కరెంట్ వస్తువులను పిల్లలు ముట్టుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను, వైర్లను ముట్టుకోవద్దు.
- ఇంట్లో ఉన్న వాటర్‌హీటర్, రైస్‌కుక్కర్, స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే ముట్టుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంటే డిష్ కనెక్షన్ తొలగించడం మంచిది.
- ఇంట్లో ఎక్కడైనా విద్యుత్‌వైరుకు ఇనుప వస్తువులు తగులుతున్నాయో చూడాలి. ఎక్కడైనా ఇనుప వస్తువుకు వైర్లు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి తొలగించే చర్యలు చేపట్టాలి.
- ఇంట్లోకి వచ్చే సర్వీసు వైర్ డ్యామేజ్ అయితే ఆలస్యం చేయకుండా సరి చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు కొత్త సర్వీసు వైర్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. అదేతీరుగా ప్రతీ కరెంట్ వస్తువుకు ఎర్త్ వైర్ బిగించుకోవడం శ్రేయస్కరం.

వ్యవసాయ భూముల వద్ద..

- వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు రోజువారీగా అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, వ్యవసాయ బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్‌ను తాకొద్దు.
- విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. గాలి వీయడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్‌లైన్ తీగలు తెగిపడే అవకాశాలు ఉంటాయి. అటువైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయవద్దు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సవరించడం కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెళ్లి తడి చేతులతో ఫ్యూజ్ తీయడం వంటివి చేయవద్దు.

అసలుకే మోసం !



మంచిర్యాల పట్టణంలో యాప్ బాధితులు

- రెట్టింపు డబ్బులంటూ ‘యాప్’లో రూ.కోట్లు వసూళ్లు
- విత్‌డ్రా ఆప్షన్ ఎత్తివేయడంతో బాధితుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెట్టిన డబ్బులకు రెట్టింపు పొందవచ్చనే ఆశ అసలుకే మోసం తెచ్చింది. ఓ యాప్ సంస్థ తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ప్రచారం చేసింది. రూ.కోట్లు వసూళ్లు చేసి తిరిగి డబ్బులు తీసుకునే అవకాశం లేకపోవడంతో బాధితులంతా లబోదిబోమంటున్నారు. దేశవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, సాంకేతికతను పెంపొందిస్తామని ‘డేటామీర్’ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రజలను ఆకర్షించింది. ఇందుకు తమ ప్రొడక్ట్స్ రోబోటిక్స్, ఏఐ, ఇంటెలిజెన్స్, డివిడెండ్లు, డేటా ప్రొడక్ట్స్, ఆయిల్ ఫ్యూచర్స్ ఇలా పలు రకాలుగా చెబుతూ రూ.300నుంచి గరిష్టంగా రూ.2కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలంటూ ఆఫర్లు ఇచ్చింది. వీటిని కొనుగోలు చేస్తే పెట్టిన డబ్బులకు రోజువారీగా వడ్డీ చెల్లించడంతోపాటు బోనస్‌లు, అధిక మొత్తంలో పొందవచ్చని ప్రచారం చేశారు. ఇదంతా నమ్మి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, గృహిణులు వేలాది మంది డబ్బులు కట్టడం మొదలుపెట్టారు. గత వారంలో ఒక రోబోట్ కొంటే రెండు ఉచితమంటూ ఆఫర్‌లో, పెట్టిన డబ్బులకు సమంగా ఇస్తామని చెబితే ఒక్కొక్కరు రూ.లక్షల్లో కట్టారు. కొందరైతే చేతిలో డబ్బు లేకున్నా, బ్యాంకుల్లో లోన్లు, బంగారం కుదవ పెట్టి, అప్పులు తెచ్చి మరీ చెల్లించారు. ఇలా ఒక్క మంచిర్యాల పట్టణంలో దాదాపు 800మంది వరకు రూ.2 కోట్లు, ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో రూ.5కోట్ల వరకు చెల్లించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోనూ వేలాదిమంది బాధితులు ఉన్నారు. ఈ నెల 22నుంచి ఎవరికీ డబ్బులు విత్‌డ్రా కాకుండా ఆప్షన్ తీసేవారు. దీంతో యాప్ నిర్వాహకులకు ఫోన్లు, వాట్సాప్ చేసినా ఎలాంటి స్పందన రావడం లేదు. అంతేకాక పెట్టిన డబ్బులు యూపీ, బెంగాల్‌కు చెందిన వేర్వేరే కంపెనీల పేర్లతోనూ ఉన్నాయి. దీంతో బాధితులు తమను చేర్పించిన వారి ఇంటి ముందుకు వెళ్లి గొడవ చేస్తున్నారు. చివరకు మంచిర్యాల పరిధిలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. బుధవారం సాయంత్రం నుంచి యాప్ నిర్వాహకుల నుంచి పెట్టుబడిదారుల అకౌంట్లు యాక్టివేట్ కావాలంటే మళ్లీ రూ.300నుంచి రూ.26,888 వరకు చెల్లిస్తే గురువారం వరకు యధావిధిగా సాగుతుందని మేసేజ్‌లు వస్తున్నాయి. గత మూడు రోజులుగా స్పందించకుండా మళ్లీ ఇలా మేసేజ్ రావడంపై ఎవరికి నమ్మకం లేక బాధితులు అందరూ ఏకమై వాట్సాప్ గ్రూప్ వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాప్‌లో డబ్బులు పెట్టిన వారంతా పోరాటానికి సిద్ధమయ్యారు. మరోవైపు ‘కొంపముంచిన ‘రెట్టింపు’ ఆశ!’ అనే శీర్షికన ‘సాక్షి’ ప్రచురించిన కథనంతో ఈ యాప్ నిర్వాహకం వెలుగులోకి వస్తోంది.

ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



పశువుల పాకను ఢీకొట్టిన బస్సు

తాంసి(బోథ్): భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామంలో బుధవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇంటి ఆవరణలోని పశువుల పాకలో ఉన్న ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు కరంజి(టి) గ్రామం నుంచి ఆదిలాబాద్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో అర్లి(టి) గ్రామ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. పశువులపాకలో ఉన్న ఎద్దు బస్సు ముందర భాగంలో ఇరుక్కోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి ఆవరణలోని చెట్టును ఢీకొట్టి బస్సు నిలిచిపోయింది. ఇంటి ఆవరణలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి పైగా ప్రయాణికులు సైతం సురక్షితంగా బయటపడ్డారు. కాగా డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బస్సు అదుపు తప్పిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



నుజ్జునుజ్జయిన ట్రావెలర్ వాహనం

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తృటిలో ప్రాణాపాయం తప్పింది. మధ్యప్రదేశ్‌లోని శివినికి చెందిన తొమ్మిది మంది యువకులు ట్రావెలర్ వాహనంలో దక్షిణ భారతయాత్రకు వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చేరుకోగానే వర్షం వల్ల ట్రావెలర్ వైపర్లు సక్రమంగా పని చేయకపోవడం.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముందు వెళ్తున్న లారీని వీరి వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ట్రావెలర్ ముందు భాగంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పాఠశాలను సందర్శించిన జాతీయ పర్యవేక్షక బృందం



పాఠశాలలో పుస్తకాలు పరిశీలిస్తున్న బృందం

సోన్: రూమ్‌టూరీడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సోన్ మండలం జాఫ్రపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలను జాతీయ పర్యవేక్షక కమిటీ సభ్యులు జెస్సీమేరి ఆధ్వర్యంలో సందర్శించి కార్యక్రమ అమలు గురించి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రూమ్ టూ రీడ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల నోడల్ అధికారి తొడిశెట్టి పరమేశ్వర్, రాష్ట్ర సమన్వయకర్త నితిన్‌కుమార్, బ్లాక్ కోఆర్డినేటర్ గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ సుందర చారి, ఉపాధ్యాయులు కరుణకుమారి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సు సిబ్బందికి అవార్డులు



అవార్డు అందుకుంటున్న సిబ్బంది

ముథోల్: మండల కేంద్రానికి చెందిన 108 అంబులెన్సు సిబ్బంది ఈఎంటీ పండరి, పైలెట్ నసురుల్లాఖాన్‌లు బుధవారం లైఫ్ సేవియర్ అవార్డులు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని 108 సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 108 సిబ్బందికి అవార్డులు అందజేశారు.


డీఆర్‌డిపో స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు

బేల: ఐటీడీఏ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్‌కు చెందిన డీఆర్‌డిపో స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని (ఐటీడీఏ, ఉట్నూర్) గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మేనేజర్ రాథోడ్ గులాబ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కబ్జాకు గురైన డీఆర్‌డిపో స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ స్థలంలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆక్రమణదారులకు సూచించారు. త్వరలోనే కంచె ఏర్పాటు చేసి, ఐటీడీఏ పేరిట ఒక బోర్డు ఏర్పాటు చేయిస్తామన్నారు. తహసీల్దార్ సవాయిసింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాజిద్, జీసీసీ అధికారి జాదవ్ రమేశ్ ఉన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్ వాగులో శనివారం రాత్రి టేకం లక్ష్మణ్ వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం సైతం అధికారులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. నీటి ప్రవాహం వల్ల ఇంకా ఆచూకీ తెలియరాలేదని రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

అభిమానంతో రావి ఆకుపై కేటీఆర్ చిత్రం



రావి ఆకుపై కేటీఆర్ చిత్రం

తాంసి: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన చిత్రకళాకారుడు గట్టు రాజు కేటీఆర్‌పై అభిమానంతో వినూత్నంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రావి ఆకుపై కేటీఆర్ చిత్రాన్ని గీసి హ్యాపీ బర్త్‌డే కేటీఆర్ అంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాడు.

కూచిపూడి నృత్యంలో చిన్నారి ప్రతిభ



నాట్యమయూరి పురస్కారంతో చిన్నారి ఆరాధ్య

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి గంజి ఆరాధ్య హైదరాబాద్‌లో నిర్వహించిన ‘బోనాల సంబరాలు -2024’ కార్యక్రమంలో కూచిపూడి నృత్యం చేసి పలువురిని ఆకట్టుకుంది. నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ బోనాల సంబరాలు కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చిన్నారికి ‘నాట్య మయూరి’ పురస్కారంతో పాటు, ప్రశంసాపత్రాన్ని అందించారు. చిన్నారి ఆరాధ్య సాంప్రదాయ నృత్యంలో రాణిస్తుండడంతో నృత్య గురువు నవ్య, పలువురు ఆమెను అభినందించారు.

బురదలో నడిచి వెళ్లి వైద్యసేవలు



బురదలో రతన్‌గూడకు వెళ్తున్న ఏఎన్‌ఎం విజయ

బజార్‌హత్నూర్: మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు విద్య, వైద్యానికి దూరం అవుతున్న విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయమయ్యాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వృత్తి పట్ల అంకితభావం గల ఏఎన్‌ఎం విజయ బుధవారం మండలంలోని టెంబి గ్రామపంచాయతీ పరిధిలోని రతన్‌గూడ, శ్యాంరావ్ గూడ గ్రామాలకు బురదలో కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. చిన్నపిల్లలకు టీకాలు వేశారు. గర్భిణీలకు, వృద్ధులకు మందులు పంపిణీ చేశారు.

వర్షంలో తప్పిపోయిన వృద్ధురాలు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: ఓ వృద్ధురాలు వర్షంలో తప్పిపోగా బ్లూకోర్టు పోలీసులు వెతికి పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉండే 70 ఏళ్ల వత్సల బాయి మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి వర్షంలో తప్పిపోయింది. కుటుంబ సభ్యులకు ఆచూకీ తెలియకపోవడంతో అర్ధరాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వృద్ధురాలి ఫొటో సహాయంతో బ్లూకోర్టు సిబ్బంది రాథోడ్ అనిల్, అజార్ ఖాన్, స్పెషల్ పార్టీ పోలీసులు ముత్యం, మహేందర్‌లు పలు కాలనీలలో వెతికారు. గొల్లపేట్ ఎస్సీ కాలనీలో ఓ వృద్ధురాలు వర్షంలో తడుస్తూ ఒంటరిగా ఉందని, ఆమె చెవిటి, మూగ కావడంతో మాట్లాడలేకపోతుందని కాలనీవాసులు ఉదయం 4 గంటల సమయంలో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తప్పిపోయిన వృద్ధురాలు వత్సల బాయిగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



పెందూరు రూప



సిడాం శ్రీజ

ఆదిలాబాద్‌రూరల్: హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఎస్ఎన్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మండలంలోని చించూఘాట్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పెందూరు రూప, 30 మీటర్ల దూరంలో బంగారు పతకం, సిడాం శ్రీజ, 20 మీటర్ల దూరంలో వెండి పతకాన్ని సాధించారు. గురువారం జరిగే కార్యక్రమంలో వీరు పతకాలను అందుకోనున్నట్లుగా కోచ్ కాత్లే మారుతీ, పీడీ రవీందర్‌లు తెలిపారు. జిల్లా తరపున ప్రతిభ చాటిన విద్యార్థినులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్, గిరిజన క్రీడల అధికారి కొరెడ్డి పార్థసారథి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు వారిని అభినందించారు.

సైబర్ క్రైం కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సైబర్‌క్రైమ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రవీణ్ గౌడ్ అనే వ్యక్తి మొబైల్‌కి నాలుగు నెలల కిందట ఒక లింక్ రాగా క్లిక్ చేశాడు. ఈ తరుణంలో సైబర్ నేరగాళ్లు అతనికి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నంబర్ చెప్పాలనడంతో వెంటనే చెప్పేశాడు. అనంతరం అతని ఖాతా నుంచి రూ.38వేలు డెబిట్ అయ్యాయి. అప్రమత్తమైన అతను 1930 కాల్ చేసి సమాచారం అందించడంతో రూ.25 వేలు హోల్డ్‌లో పెట్టారు. హోల్డ్‌లో పెట్టిన డబ్బులు పొందేందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉండగా బుధవారం టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య

సోన్: చెట్టుకు ఉరివేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం సాకేర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై కే.గోపి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలానికి చెందిన గాసెట్ దత్తాద్రి (53) కుమారుడు శేఖర్‌తో కలిసి సాకేర గ్రామంలో రోడ్డు పనులు చేస్తుంటాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించిన దత్తాద్రి తాగిన మత్తులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమయపాలన లోపం.. వైద్యానికి కష్టం!





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల పేద ప్రజల వైద్యానికి పెద్ద దిక్కుగా ఉన్న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటలకు విధులకు హాజరు కావాల్సిన వైద్యులు తమ ఇష్టారాజ్యంగా వస్తున్నారు. దీంతో ఆస్పత్రిలోని ప్రధాన ఓపీ విభాగాల్లో సీనియర్ వైద్యుల స్థానంలో జూనియర్‌లే వైద్యసేవలు అందిస్తున్నారు. తమ ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రాధాన్యతనిస్తూ రిమ్స్ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని వారిపై ఆరోపణలు విన్పిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్